## క్లుప్తంగా

### మహిళల భద్రతకు ప్రాధాన్యత



కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ, ఎస్సైలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు సత్రంపాడులోని అంబికా దర్బార్ అగర్‌బత్తి కంపెనీలో పనిచేస్తున్న మహిళలకు శక్తిటీమ్ మహిళా ఎస్సై నాగమణి, బృందం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు బహిరంగ ప్రదేశాల్లోనే కాకుండా, పనిచేసే ప్రదేశాల్లోనూ వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు లేకుండా స్వేచ్ఛగా జీవించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళలపై నేరాలు చోటుచేసుకున్న సందర్భంలో అత్యవసర స్థితిలో 112, 181, 1098, 1930 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు ఎల్లవేళలా అండగా ఉంటామని డీఎస్పీ తెలిపారు.

### సంతకాల సేకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఓటర్ల లిస్ట్‌లో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం స్థానిక అగ్రహారం, 10వ డివిజన్‌లో ఎస్‌బీఐ, దొంగల మండపం, అంబికా సెంటర్ తదితర ప్రాంతాల్లో సంతకాలు సేకరించారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు నాయకత్వం వహించారు.

### నేడు పురస్కార ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శరన్నవరాత్రుల సాహిత్యోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు కేవీ సత్యనారాయణ సాహిత్య పురస్కార ప్రదానం, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సాహిత్య మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడుపల్లి మోహన గుప్త, పుల్లాభొట్ల పురుషోత్తమరావు పేర్కొన్నారు. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో జరిగే కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త ఎర్రాప్రగడ రామకృష్ణకు పురస్కారం అందజేయనున్నారు.

### బాధ్యతల స్వీకారం

ఏలూరు(మెట్రో): పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఏలూరులో జోరుగా చోరీలు
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇల్లు భద్రం



ఏలూరు ఆర్‌టీఓ కార్యాలయం వద్ద ఓ ఇంట్లో చోరీని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఇంటి దొంగతనం కేసులు పెరుగుతున్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరిస్తున్నారు. ఏలూరు, పరిసర ప్రాంతాల్లో నిత్యం దొంగలు రెక్కీలు చేస్తూ, తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుంటూ చోరీలకు పాల్పడుతున్నారు. పక్కన ఉన్న ఇళ్లలోని వారికి సైతం చిన్న శబ్దం రాకుండా అత్యంత చాకచక్యంగా తాళాలు పగులగొట్టి, ఇల్లు గుల్ల చేస్తున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్ములు కాజేస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా చోరీ కేసులు ఇటీవల కాలంలో అధికంగా నమోదు కావటం గమనార్హం.

**చోరీ గ్యాంగ్‌లు**

ఏలూరు నగరంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా చోరీలకు పాల్పడే గ్యాంగ్‌లు వచ్చినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఏపీ రాష్ట్రంలోని బాపట్ల ప్రాంతం, మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌లు సైతం సంచరిస్తున్నట్టు అనుమానిస్తున్నారు. వీరంతా దొంగతనాలకు పాల్పడడంలో ఆరితేరి ఉండడం, కొన్ని గ్యాంగ్‌ల స్టైల్ రాబరీలుగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత, ఆరోగ్య పరమైన, దైవదర్శనాలకు, శుభకార్యాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసుల సూచనలు పాటించాలని చెబుతున్నారు.

**ఈ నెలలో జరిగిన చోరీల్లో కొన్ని ఇలా..**

- ఏలూరు ఆర్‌టీఓ కార్యాలయం ప్రాంతంలో ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోని రూ.1 లక్ష నగదు అపహరించుకుపోయారు. ఆశ్రం హాస్పిటల్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్న శైలజ ఈనెల 17న కుటుంబంతో షిర్డీ వెళ్లారు. తిరిగి నాలుగు రోజులకు ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ఏలూరు శివారు వట్లూరు ప్రాంతానికి చెందిన ధనలక్ష్మి తన భర్త కాలికి శస్త్రచికిత్స నిమిత్తం ఇంటికి తాళాలు వేసి హాస్పిటల్‌కు వేరే ఊరు వెళ్లారు. 10 రోజుల అనంతరం తిరిగి ఇంటికి వచ్చేసరికి బీరువాలోని ఆరు కాసుల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.25 వేల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ఏలూరు రూరల్ హనుమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన చల్లా సాయి నిర్మల వన్‌టౌన్ ప్రాంతంలో కూల్ డ్రింక్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈనెల 19న షాపు కట్టేసిన అనంతరం ఆమె తన స్కూటర్ డిక్కీలో రూ.50 వేల నగదు పెట్టుకుని తన పిన్ని ఇంటికి నెహ్రూనగర్‌కు వెళ్లారు. స్కూటర్‌ను బయట పార్కింగ్ చేసి పిన్ని ఇంట్లోకి వెళ్లి బయటకు వచ్చి చూసే సరికి డిక్కీలోని నగదు మాయమైంది. దీనిపై ఏలూరు రూరల్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

### ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించాలి



ప్రజలు విలువైన బంగారు అభరణాలు, వెండి వస్తువులను భద్రంగా బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలి. వేరే ఊరు వెళ్లే క్రమంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలి. మీ సమీప ప్రాంతంలోని పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇస్తే.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఎవరైనా సీసీ కెమెరాకు ఎదురుగా వెళ్లినా వెంటనే మీకు అలర్ట్ వస్తుంది. మీ ఇంటిని సీసీ కెమెరాలో చూసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఏదైనా జరిగినా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారంతో నేరానికి పాల్పడిన వ్యక్తులను సత్వరమే పట్టుకునే వీలుంటుంది. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

### రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు(టూటౌన్): సర్వీస్ రోడ్లు నిర్మించకపోవడం, అండర్ పాస్‌కు తగినంత ఎత్తు వెడల్పు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏలూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కు వినతిపత్రం అందించారు. సర్వీస్ రోడ్డుకు అండర్ పాస్‌లకు అనుసంధానం లేదని, సర్వీస్ రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరారు. హైవే అథారిటీ అధికారులతో ఎంపీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, కంచర్ల శ్రీనివాసరావు, వందనపు సాయిబాబా, రైతులు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు

ఏలూరు(టూటౌన్): సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు మద్దతు పలుకుతున్నానని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ సీనియార్టీ జాబితా విడుదల చేయాలని, ఉద్యోగులను సంబంధిత విభాగాలకు బదిలీ చేయాలని, సర్వే పనులు నిలుపుదల చేసి, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయాలు వద్ద, గాంధీ విగ్రహాల వద్ద నిరసన తెలుపుతున్నారని వివరించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఏలూరు బిషప్ హౌస్‌లో పూర్వ విద్యార్థులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఏరా.. బాలయ్య.. అప్పుడు సన్నగా పీలగా ఉండేవాడివి.. ఇప్పుడు లావయ్యావురా.. కాత్యాయని నువ్వు అప్పుడెలా ఉన్నావో.. ఇప్పుడు అలానే ఉన్నావు.. మన శేఖర్ విజయవాడలో ఎస్‌బీఐ మేనేజరయ్యాడంట్రా.. గ్రేట్ ఇలా సరద సరదాగా అలనాటి బాల్య స్మృతులను దెందులూరు గరపాటి హైమావతి జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఏలూరు బిషప్ హౌస్‌లో 2000 – 2001 పదో తరగతి పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత 50 మంది కలుసుకున్నారు. ఒకరు నొకరు యోగాక్షేమాలు తెలుసుకున్నారు. వాట్సాప్ గ్రూఫ్ ద్వారా అందరినీ ఒకే చోటకు చేర్చడంలో కీలకంగా వ్యవహరించిన రామ్‌మోహన్‌రాయ్, రంగనాథ్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, కనుమూరి శ్రీనివాస్‌లను అభినందించారు. సైన్స్ మాస్టార్ ఘోష్, హిందీ మాస్టార్ సత్యనారాయణలను సన్మానించారు. కరోనా సమయంలో మరణించిన సహచర స్నేహితులకు ఘన నివాళులర్పించారు. బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై వంటి సుదూర ప్రాంతాల నుంచి ఆత్మీయ సమావేశానికి విచ్చేశారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ శివశంకరరావు (సీఎస్ఆర్‌ఎఫ్ డైరెక్టర్), రూప, గిరిబాబు, నాగలక్ష్మి, రజనీ, సుబ్బిశెట్టి శ్రీనివాస్ ఇలా పలువురు పాల్గొన్నారు.

### ఫలించిన పోరాటం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూజీసీ నుంచి సెకండ్ కౌన్సెలింగ్‌లో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఏ పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టిందని, ఇది ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. ఏలూరులో ఆయన మీడియాతో మాట్లాడారు.

### రేపు లోక కళ్యాణ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయ పాత కౌన్సిల్ హాలులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు లోక కళ్యాణ మేళా నిర్వహించనున్నట్టు నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారులకు ఈ మేళా ద్వారా లబ్ధి పొందే విధంగా సేవలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

### మహిళల ఆరోగ్యంతోనే మేలు

చింతలపూడి : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని డీసీహెచ్‌ఓ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం స్వస్థ్ నారీ, స్వశక్తి పరివర్ అభియాన్ కార్యక్రమం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య నిపుణులు స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వహించారు.

### ద్వారకాతిరుమలలో మెడికల్ షాపు లైసెన్స్ రద్దు

ద్వారకాతిరుమల: స్థానిక ఒక మెడికల్ షాపు యజమాని నిషేధిత మందులను విక్రయిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా రోగులకు వైద్యం చేస్తున్నట్టు నిర్ధారించిన డ్రగ్ అధికారులు షాపు లైసెన్స్‌ను రద్దు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డ్రగ్ అధికారుల కథనం ప్రకారం.. అనధికారికంగా మందులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో డ్రగ్ అధికారులు బుట్టాయిగూడెంలో కె.గణేష్ అనే వ్యక్తిని ఈ ఏడాది జులై 4న అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ మెడికల్ షాపు యజమానికి అబార్షన్ కిట్లు, సెక్స్ సామర్థ్యాన్ని పెంచే మందులు విక్రయించినట్టు చెప్పాడు. దానికి సంబంధించిన ఆధారాలను అధికారులు అతడి వద్ద సేకరించారు. అదే నెల 16న శ్రీకృష్ణ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గణేష్ వద్ద కొనుగోలు చేసి, ప్రజలకు అమ్ముతున్న నిషేధిత మందులకు చెందిన ఆధారాలను షాపు యజమాని నుంచి సేకరించారు. గత రెండేళ్లుగా ఈ వ్యాపారం జరుగుతున్నట్టు గుర్తించారు. దీనిపై మెడికల్ షాపు యజమానికి నోటీసు ఇవ్వగా, దానికి సరైన సమాధానం రాలేదని, దాంతో డ్రగ్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డీఎండీకే చక్రవర్తి ఈనెల 9న షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ ఆలీ తెలిపారు. దీనిపై షాపు యజమాని హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు తిరస్కరించిందని చెప్పారు.



లలితా త్రిపుర సుందరీ దేవిగా పత్తేబాద కనకదుర్గ



రాజశ్యామలా దేవిగా పవర్‌పేట అన్నపూర్ణ



కనకధార దేవిగా బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ



లలితాత్రిపుర సుందరీ దేవిగా దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రం రాజరాజేశ్వరి దేవి

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కుటుంబం చెంతకు బాలుడు



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులను తమ కుటుంబాల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తున్నామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో అనాథలు, బాలకార్మికులు, పనుల్లో, వసతి గృహాల్లో ఉండిపోయిన పిల్లల తల్లిదండ్రులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఏలూరు శక్తిటీమ్ సభ్యులు గత కొంత కాలంగా ఏలూరు పరిసర ప్రాంతాల్లోని హోమ్స్‌లో ఉన్న పిల్లల కుటుంబ సభ్యుల అచూకీ తెలుసుకునేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఏలూరు శనివారపుపేట బాలుర వసతిగృహంలో చాలా కాలంగా ఒక బాలుడు ఉంటున్నాడని, ఆ బాలుడు మావయ్య ఇంటిలో ఉంటూ పారిపోయి బయటకు రాగా, ఏలూరులోని ప్రభుత్వ వసతిగృహంలో గుర్తించామని తెలిపారు. ఆ బాలుడి కుటుంబ సభ్యుల ఆచూకీ తెలుసుకున్నామని శనివారం ఏలూరు వసతిగృహం వద్ద వారికి అప్పగించామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగమణి, శక్తి టీమ్ సభ్యులు ఉన్నారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు శనివారం రూ.2,01,116 విరాళంగా అందజేశారు. నల్గొండకు చెందిన విన్నకోట శ్రీలక్ష్మీ ప్రసన్న రూ.1,01,116, విజయవాడకు చెందిన శ్రీకొండ మహాలక్ష్మీ దేవి రూ.1,00,000 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు.

### పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

లింగపాలెం: వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తనిఖీ చేశారు. పెండింగ్ ఫైల్స్ వివరాలను ఆయన ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

# డిజిటల్ బుక్‌తో శ్రేణులకు శ్రీరామరక్ష

- వైఎస్సార్‌సీపీ నాయకుల జోలికొస్తే ఖబడ్దార్
- మాజీ ఎమ్మెల్యే బాలరాజు హెచ్చరిక



డిజిటల్ బుక్ పోస్టర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే బాలరాజు, సమన్వయ కర్త రాజ్యలక్ష్మి, తదితరులు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన డిజిటల్ బుక్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అక్రమ కేసులకు, అరెస్ట్‌లకు, అన్యాయాలకు గురైన వారికి అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమి నాయకులు ఎవరైనా తమ కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేయాలని చూస్తే వారి పేర్లను ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 ఏళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై అక్రమ కేసులు పెట్టడంతోపాటు అరాచకాలు పాల్పడ్డారని గుర్తుచేశారు. హత్యలు, హత్యాయత్నాలు, దాడులు చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టడానికే అధికారంలోకి వచ్చినట్టు కూటమి ప్రభుత్వం కనిపిస్తోందని ఆరోపించారు.

**కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదు**

పోలవరం నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లు, దాడులకు పాల్పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా నాలుగు సార్లు పోలవరం నియోజకవర్గంలో పనిచేశానని, ఆ సమయంలో ఏనాడూ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలను చేపట్టలేదని బాలరాజు వివరించారు. ఇటీవల బుట్టాయగూడెం మండలం కె.అంకంపాలెంకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెల్లం నవీన్‌పై అక్రమ కేసు పెట్టి 41 నోటీస్ ఇచ్చి సెల్‌ఫోన్ కూడా లాక్కున్నారని వివరించారు. స్థానిక ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల కథనాలను ఫార్వార్డ్ చేస్తే కేసు పెడతారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, ఖబడ్దార్ అని బాలరాజు కూటమి నాయకులను హెచ్చరించారు. అధికార మదంతో రెచ్చిపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, సర్పంచ్‌లు తెల్లం రాముడు, బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్య దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు పాలకుల ఊడిగం



సదస్సు ఐక్యత చాటుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: పాలకవర్గాలు ఉద్యమాలను, ఉద్యమించే వారిని అణచివేస్తూ, కార్పొరేట్లకు మేలు చేసేందుకు ఊడిగం చేస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫాసిస్ట్ వ్యతిరేక రాష్ట్ర సదస్సు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్ శ్రీమన్నారాయణ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ హిందూ భావజాలం దేశాన్ని భయానక పరిస్థితులకు తీసుకువెళుతుందని ఆరోపించారు. మనువాద భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు అందరూ ఫాసిస్టు శక్తులకు అనుకూలరేనని ఆరోపించారు. కార్యక్రమంలో డాక్టర్ అలుగు ఆనంద శేఖర్, సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ రాష్ట్ర కార్యదర్శి అలుపుర వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రంగనాథం, మాదేపల్లి వెంకటరత్నం, భీమవరపు సుబ్బారావు, తోట జీవన్న, పలనాడు జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 24 | అరటి కాయ (1) | 06–08 |
| వంకాయలు (గులాబీ) | 30 | చిక్కుడు కాయలు | 64 |
| వంకాయలు (కాంతులు) | 40 | బిళ్లచిక్కుడు | 00 |
| వంకాయలు (తెలుపు) | 00 | చామదుంపలు | 38 |
| బెండకాయలు | 30 | ములక్కాడలు | 10, 15 |
| పచ్చిమిర్చి | 44 | కంద | 00 |
| కాకర కాయలు | 36 | బీట్‌రూట్ | 44 |
| బీరకాయలు | 36 | కీరా దోస | 44 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| క్యాబేజీ | 26 | అల్లం | 70–96 |
| క్యారెట్ | 40 | కొత్తిమీర (కట్ట) | 30 |
| దొండకాయలు | 40 | పాలకూర | 10 |
| బంగాళదుంపలు | 34 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 25 | చుక్కకూర | 10 |
| గోరుచిక్కుడు | 40 | గోంగూర | 07–10 |
| దోసకాయలు | 28 | పుదీనా | 05 |
| ఆనపకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 80 |
| పొట్లకాయ(1) | 20 | చిలకదదుంప | 48 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 08 |
| ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 26 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 22 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 04 |
| ఏలూరు – అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 11 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 08 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 02 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 08 |
| ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 09 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 07 |
| ఏలూరు –ఈసీఐఎల్ | 22.30 | 4814 | 09 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 24 |